
ప్రజాశక్తి
మంగళవారం 24 జూన్ 2025



అల్లూరి సీతారామరాజు

సమస్యలపై విద్యుత్ ఉద్యోగుల వినతి



వినతిపత్రాన్ని ఇస్తున్న యూనియన్ నేతలు

ప్రజాశక్తి-పాడేరు: సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ సంస్థ ఉద్యోగులకు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అల్లూరి జిల్లాలో ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజనీర్, డిఆర్‌ఓకి వినతి పత్రాలను ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అందజేశారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్ గ్రేడ్ బి2 జేఎల్ఎంలకు విద్యుత్ సంస్థ గ్రేడ్స్ ద్వారా బదిలీలు చేపట్టాలని, రేషనలైజేషన్ పద్ధతి వీరికి వర్తింప చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రీజనల్ కార్యదర్శి సత్యారావు, సిఐటియు నాయకులు సుందర్ పాల్గొన్నారు.

తెరుచుకోని పాఠశాలలు

సిఆర్‌టిల నియామకంపై నిర్వహించని కౌన్సెలింగ్



పెదపాడులో మూసివున్న పాఠశాల

ప్రజాశక్తి దుంబ్రిగుడ:- ఐటీడీఏ పరిధిలోని జీపీఎస్ ఎలిమెంటరీ పాఠశాలల్లో గతంలో పనిచేసిన సిఆర్టిలను ప్రభుత్వం రెన్యువల్ చేసింది. కానీ, ఇప్పటికీ పాఠశాలలకు కేటాయించడానికి కౌన్సిలింగ్ చేయలేదు. దీంతో, గతంలో సీఆర్టీలు పనిచేసిన పాఠశాలలు మూత పడుతున్నాయి. మండలంలోని కొర్ర పెద్దపాడు గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయుడు లేక ఆ పాఠశాల ఇప్పటివరకు తెరుచుకోలేదు. దీంతో, ఆ గ్రామానికి సమీపంలో గల పాఠశాలలో అక్కడి విద్యార్థులు విద్యనభ్యసించడానికి కాలినడకన వెళ్తున్నారు. ఈ పాఠశాలలో సుమారు 51 మంది పివిటిజి విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలు పున ప్రారంభమై సుమారు పది రోజులు గడిచినా ఇప్పటికీ ఉపాధ్యాయులను నియమించకపోవడంతో విద్యార్థులు విద్యాభ్యాసాన్ని కోల్పోతున్నారు తక్షణమే అధికార యంత్రాంగం స్పందించి గ్రామంలో ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక ఎంఈఓను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

విధులకు డుమ్మా.. ఇలాగైతే ఎలాగమ్మా..?

-హెచ్‌ఎం విధులకు హాజరుకాని వైనం
-కౌన్సిలింగ్‌కు వెళ్లిన కాంట్రాక్టు ఉపాధ్యాయురాలు
-సీలేరు ఎంపిపి పాఠశాలకు తాళం



తాళాలు వేసి ఉన్న పాఠశాల గది

ప్రజాశక్తి -సీలేరు : జికె వీధి మండలం సీలేరు ఎంపిపి పాఠశాల నేటికీ తెరవకపోవడంతో విద్యార్థిని గురువులు లేక ప్రధానోపాధ్యాయులు కార్యాలయానికి తాళాలు వేసి ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభమై నేటికీ ఆ పాఠశాల తెరవకపోవడంతో ప్రధానోపాధ్యాయులు క్రాంతికుమారి నిర్లక్ష్య వైఖరిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2024-25 సంవత్సరంలో ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులు కొనసాగాల్సి ఉండగా మూడు, నాలుగు, ఐదు తరగతులను గత ప్రభుత్వం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విలీనం చేసింది. ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ ఇదే పాఠశాలలో నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. గతఏడాది పాఠశాల పని దినాలు చివరి వరకూ హెచ్‌ఎంగా క్రాంతికుమారి ఎంటిఎస్ ఉపాధ్యాయురాలు సూరి కుమారి కొనసాగేవారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్ కొరతతో మూడు నెలలు హైస్కూల్లో విద్యాబోధన చేయాలని సూర్య కుమారిని ఆదేశించారు. ఈ మేరకు ఆమె హైస్కూల్లో గత ఏడాది చివరి వరకూ కొనసాగారు. కొద్దిరోజుల క్రితం చేపట్టిన ఉపాధ్యాయ బదిలీలు కౌన్సిలింగ్‌లో భాగంగా హెచ్‌ఎం క్రాంతి కుమారికి వేరే చోటికి బదిలీ కాగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు చేపడుతున్న సూర్యకుమారి కౌన్సిలింగ్‌లో భాగంగా మైదాన ప్రాంతంలో ఉన్నారు. ఐటీడీఏ బదిలీల్లో భాగంగా జికె వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధి గొర్లెవోవ ఎంపిపి స్కూల్ నుంచి దేవయానిని సీలేరు ఎంపిపి స్కూల్‌కి బదిలీ చేశారు. దేవయాని ఉత్తర్వులు తీసుకుని వచ్చినా హెచ్‌ఎం క్రాంతికుమారి అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో సమాచారం అందించిన క్రాంతికుమారి రానని సమాధానం ఇవ్వడంతో సూర్యకుమారికి ఉత్తర్వులు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న బదిలీలు ప్రక్రియ తీవ్ర జాప్యం జరుగుతుండడంతో నిబంధనలు సడలించింది. బదిలీ అయిన ఉపాధ్యాయులు ఆయా స్థానాల్లో కొత్తగా ఉపాధ్యాయులు చేరేవరకు పాత పాఠశాలల్లోనే విధులు చేపట్టాలని కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో సదరు ఉపాధ్యాయురాలు దేవయాని గొర్లెవో పాఠశాలకు తిరిగి వెళ్లిపోయారు. ఇక్కడ మొత్తం 75 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. విధులకు హాజరు కావాల్సిన హెచ్‌ఎం క్రాంతికుమారి విధులకు డుమ్మా కొట్టి పాఠశాల తెరవలేదు. కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న ఒక్క ఎంటిఎస్ ఉపాధ్యాయురాలు సూర్యకుమారి మాత్రం విధులకు వచ్చినా హాజరయ్యేవారు. అయితే ప్రస్తుతం ఆమె కౌన్సిలింగ్ ప్రక్రియలో ఉండడం వల్ల హాజరు కాలేకపోతున్నారు. దీంతో పాఠశాలకు తాళం పడింది. బొడ్డగండి పంచాయతీ మెట్టగూడ గ్రామానికి చెందిన వంతల జోయిసన్ తన కుమారుడు వంతల భైరాముని పాఠశాలలో చేర్పించేందుకు సోమవారం పాఠశాలకు వచ్చారు. అయితే పాఠశాలకు తాళం వేసి ఉండడంతో ఆశ్చర్యపోయి వెనుదిరిగి వెళ్లిపోతుండగా అదే సమయంలో పాఠశాల సమస్యల గురించి తెలుసుకునేందుకు వెళ్లిన ప్రజాశక్తి ప్రతినిధి ఆరా తీయగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటిడిఎ పిఒ, డిఇఒ చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



పాఠశాలలో చేర్పించేందుకు వచ్చిన విద్యార్థి తండ్రి జోయిసన్



ఆందోళన చేపడుతున్న అంగన్‌వాడీలు

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని

అంగన్వాడీల ఆందోళన

ప్రజాశక్తి-పాడేరు: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా పాడేరు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అంగన్వాడీల సమస్యలపై డిఆర్ఓకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాగ్యలక్ష్మి అధ్యక్షులు డి.నాగమ్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎల్.సుందర్‌రావు మాట్లాడుతూ, ఎన్నికల ముందు కూటమి పెద్దలు చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొని నేడు అధికారంలోకి రాగానే అంగన్వాడీలను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులుగా అంగన్వాడీలను నమోదు చేసి తప్పు చేసారని, ఇప్పటికే పనిగంటల పెంచి విపరీతమైన పని ఒత్తిడిని పెంచారని గుర్తుచేశారు. అంగన్వాడీ ఆయాకు రూ.7వేలు, టీచరుకు 11500 చెల్లిస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా చెప్పడానికి కూటమి ప్రభుత్వానికి సిగ్గని పించ లేదా అని ప్రశ్నించారు. అంగన్వాడి కుటుంబంలో పిల్లలకు తల్లికి వందనం అమలు కాలేదని వెబ్సైట్లో ఉద్యోగస్తులుగా చూపిస్తున్నారని తెలిపారు. ఇస్తున్న వేతనం కూడా అంగన్వాడీ సెంటర్లోని పిల్లలకు వండి పెట్టేందుకు, సెంటర్ అద్దెలకు పెట్టుబడి పెడుతూ పిల్లలతో పస్తులు ఉండాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మొబైల్స్ సక్రమంగా పనిచేలేదని అన్నారు. గిరిజన ప్రాంతంలో ఇంటర్నెట్ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో టీచర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణం గిరిజన ప్రాంతంలో ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం అంగన్వాడీలకు వేతనాల్లో కేంద్ర వాటాని పెంచుతానని వాగ్దానం చేసి ఆరేళ్లు పూర్తయినా ఒక్క రూపాయి కూడా పెంచలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కళావతి, జిల్లా నాయకులు చిన్నారి, పెంటమ్మ, కొండమ్మ, వెంకటలక్ష్మి, మంజుల, శాంతి పాల్గొన్నారు.

చిన్నపిల్లల వైద్యాధికారిణిగా నీలవేణి



ప్రజాశక్తి-చింతపల్లి: రాష్ట్ర ప్రభుత్వ సాధారణ బదిలీలలో భాగంగా చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి చిన్నపిల్లల వైద్య నిపుణురాలిగా ఎం.నీలవేణి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహించిన ఆమె తాజాగా చింతపల్లిలో బాధ్యతలు స్వీకరించారు. శిశు మరణాలను తగ్గించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 52 అర్జీలు

ప్రజాశక్తి- రంపచోడవరం : స్థానిక ఐటిడిఎ సమావేశపు హాలులో సోమవారం వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వారం 52 అర్జీలు వచ్చాయని పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హతలను బట్టి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, రంపచోడవరం పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏజెన్సీ డిఇఒ వై.మల్లేశ్వరరావు, అడిషనల్ డిఎంహెచ్ఒ శిరీష, డిఎల్‌పిఒ నరసింహారావు, డిఎల్‌డిఒ కె.కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ రవి కుమార్, పిహెచ్ఒ దేవదానం, ఎఎంఒ విజయ భాస్కర్, డిఎంఒ విజ్ఞానశ్రీ, వెలుగు డిపిఎం పరమేశ్వరరావు, ఎడిఎలు సిహెచ్ కేవీ చౌదరి, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి యం.సావిత్రి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, పి.వెంకటరమణ,మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



బస్సులో వెళుతున్న నిర్వాసితులు

పునరావాస కాలనీల క్షేత్రస్థాయి పరిశీలనకు తరలివెళ్లిన నిర్వాసితులు

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు మండలం నుంచి పోలవరం పునరావాస కాలనీల క్షేత్రస్థాయి పరిశోధనకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సులో నిర్వాసితులు సోమవారం చింతూరు నుండి పశ్చిమగోదావరి జిల్లా తాడువాయికు తరలి వెళ్లారు. గతంలో తాడువాయి ప్రాంతాన్ని పరిశీలించడం జరిగింది. నిర్వాసితుల అభ్యర్థన మేరకు తూర్పుగోదావరి జిల్లా కష్టునిపాలెంలో కూడా ఆర్అండ్ఆర్ కాలనీలు నిర్మించేందుకు ప్రభుత్వం అభిప్రాయ సేకరణ కూడా చేయడం జరిగింది. ఇటీవల రంపచోడవరంలోని రాజవొమ్మంగి మండలం సూదికొండ ప్రాంతాన్ని కూడా గిరిజనేతరులకు ప్రభుత్వం పరిశీలనకై తరలించారు. ఈ క్రమంలో మళ్లీ తాడువాయిలో ప్రదేశాన్ని పరిశీలించేందుకు వెళ్తున్న వారి కోసం ప్రభుత్వ అధికారులు ఉచితబస్సు, భోజన ఏర్పాట్లను కూడా చేశారు. సుమారు 60 మంది గిరిజనేతర నిర్వాసితులు కేజీ కోడేరు, వేగితోట, మల్లెతోట, చోటూరు, ముకునూరు గ్రామాలకు చెందిన వారు కూడా మరో ప్రైవేట్ వాహనంలో తరలివెళ్లారు.పోలవరం చింతూరు డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ చంద్రశేఖర్, తహశీల్దార్ చిరంజీవి, వీఆర్వో రామచంద్రరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై తక్షణమే విచారణ జరిపించాలి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు



లోతా రామారావు

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని బొర్నగూడెంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ తవ్వకాల దగ్గర గోతిలో పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలుడి సంఘటనపై విచారణ జరిపించాలని, బాలుడుకి మెరుగైన వైద్యం అందించాలని దీనికి కారకులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, రంపచోడవరం నియోజకవర్గంలో ఉన్న అక్రమ మైనింగ్‌ను వెంటనే నిలుపుదల చేయాలనీ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో రంపచోడవరం, అడ్డతీగల, గంగవరం, చింతూరు, ఎటపాక, మండలాల్లో గిరిజన చట్టాలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లోత రామారావు డిమాండ్ చేశారు. మైనింగ్ వల్ల గిరిజనులకు జీవనోపాధి దెబ్బతింటోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

చెట్టుపై నుంచి పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - విఆర్‌పురం : మండలంలోని ములకనపల్లి పంచాయతీ వీరపాపన్నకుంటలో రవ్వ రాంబాబు అనే బాలుడు ఆదివారం తోటిపిల్లలతో ఆడుకుంటూ చెట్టుపైకెక్కి ప్రమాదవశాత్తూ జారిపడ్డాడు. చింతూరు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం విఆర్‌పురం పోలీస్ స్టేషన్‌లో తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చింతూరు ఏరియా హాస్పిటల్ నందు పోస్టుమార్టం నిర్వహించినట్టు పోలీసులు తెలిపారు.



ర్యాలీ చేపడుతున్న ఎమ్మెల్యేలు, నాయకులు

ఉపాధి, నిరుద్యోగ భృతిపై..

వైసిపి ఆధ్వర్యాన 'యువత పోరు'

ప్రజాశక్తి-పాడేరు: కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం గడిచినా ఫీజు రీయింబర్సుమెంట్ చెల్లించకుండా విద్యార్థులను... ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతకు కూటమి ప్రభుత్వం మొండి చెయ్యి చూపిస్తోందని పాడేరు అరుకు ఎమ్మెల్యేలు. మత్స్యరాస విశ్వేశ్వర రాజు, రేగం మత్స్య లింగం దుయ్యబట్టారు. రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన యువత పోరు నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని సోమవారం పాడేరులో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం యువత సమస్యలపై డిఆర్వో పద్మలతకి వినతిపత్రం అందజేశారు,. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన, అందక లక్షలాది మంది తీవ్ర కష్టాలు పడుతున్నారని అన్నారు... అరకు శాసన సభ్యులు రేగం మత్యలింగం మాట్లాడుతూ, విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ శాసన సభ్యురాలు వైసీపీ ఎస్టీ సెల్ అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర వైసిపి యువజన ఉపాధ్యక్షులు రేగం చాణక్య, యువజన జిల్లా అధ్యక్షులు గబ్బాడి శేఖర్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు లోచలి వరప్రసాద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కురస పార్వతమ్మ, పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పిటిసిలు, ఎంపీటీసీలు, సర్పంచులు

కూనవరం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని యువనేత బత్తుల వెంకటేష్ అన్నారు. వైసిపి యూత్ ఆధ్వర్యంలో చింతూరు ఐటిడిఎ ఎపిఒకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. యువత అధ్యక్షుడు పాపారావు మాట్లాడుతూ తల్లికి వందనం పథకంలో చాలామందికి ఏదో వంకపెట్టి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల మరియదాసు, వైసిపి మండల కన్వీనర్ ఆలూరి కోటయ్య, ఎంపిపి పాయం రంగమ్మ, సర్పంచులు కారం పార్వతి, సున్నం అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

విఆర్ పురం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిరుద్యోగభృతి నెలకు 1500 ఇస్తానని ఏడాది గడిచిన దాని ఊసే లేదన్నారు తక్షణమే ఎన్నికలు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే యువజన విభాగం ఆధ్వర్యంలో ఆందోళన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. వైఎస్ఆర్‌సిపి యువజన విభాగం ఆధ్వర్యంలో చింతూరు ఐటిడిఎ ఎపిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువత అధ్యక్షుడు పాపారావు యూత్ లీడర్ బత్తుల వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికలు ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యువతను విస్మరించిందన్నారు. కార్యక్రమంలో వైసీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల మరియదాసు, వైసిపి మండల కన్వీనర్ ఆలూరి కోటయ్య, ఎంపిపి పాయం రంగమ్మ, సర్పంచులు కారం పార్వతి పాల్గొన్నారు.

ఎంఒయు ప్రకారం నిర్వాసితులకు భూమి ఇవ్వాలి

- కత్తనాపల్లిలో 86 కుటుంబాలకు నష్టపరిహారం అందించాలి
- కొండమొదలు సర్పంచ్ డిమాండ్
- ఐటిడిఎ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష
- మద్దతు పలికిన పలు సంఘాల నాయకులు



నిరసన దీక్షలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - రంపచోడవరం / దేవీపట్నం : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులైన కొండమొదలు పెద్దలతో ప్రభుత్వం 2017లో కుదుర్చుకున్న ఎంఒయు ప్రకారం ఆదివాసులకు నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేస్తూ కొండమొదలు పంచాయతీ సర్పంచ్ వేట్ల విజయ రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయం ముందు సోమవారం నిరసన దీక్షను చేపట్టారు. ముందుగా రంపచోడవరం ఆర్టిసి కాంప్లెక్స్ నుంచి ఐటిడిఎ కార్యాలయం వరకూ కొండ మొదలు పంచాయతీ గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏజెన్సీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఇల్లా రామిరెడ్డి వేట్ల విజయకు ఎర్రకండువా వేసి దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ పోరాడాలని పిలుపునిచ్చారు. దీక్షకు ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు వంజం జోగారావు అధ్యక్షత వహించగా ప్రధాన వక్త రైతుకూలి సంఘం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ దంతులూరి వర్మ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు శంకుస్థాపన చేసి రెండు దశాబ్దాలు గడుస్తున్నా ఇంకా నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు మొదలుపెట్టి పూర్తి నష్టపరి హారం చెల్లించకుండా బలవంతంగా గెంటివేసిన వాళ్లలో కొండమొదలు పంచాయతీ ప్రాంత ప్రజలు కూడా ఉన్నారన్నారు. 2017 జూన్‌న కొండమొదలు పెద్దలతో ప్రభుత్వం అవగాహన చేసుకుంది. ఇప్పటివరకూ ఎవరూ పట్టించుకోలేదన్నారు. తక్షణమే చర్యలు చేపట్టాలని, కొండమొదల సర్పంచ్ విజయ చేపట్టిన నిరసన దీక్షకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ విజయ మాట్లాడుతూ కత్తనాపల్లి గ్రామంలో 86 కుటుంబాలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, ఈ దీక్షకు మద్దతుగా రేపు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో పిలుపునిచ్చామని దానికి మిగతా అన్ని వామపక్ష, గిరిజన, ఆదివాసీ సంఘాల నాయకులు, మేధావులు, ప్రజాతంత్ర వాదులు అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి కుంజా దూలన్నా, రాష్ట్ర రైతు కూలి సంఘం ఉమ్మడి గోదావరి జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి ఉప్పెన కిరణ్, సిపిఐ నాయకులు కుమార్, హ్యూమన్ రైట్స్ వాచ్ నాయకులు బాలు అక్కిసా, ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులు బొర్రా అజయ్ కుమార్, హ్యూమన్ రైట్స్ ఫోరమ్ నాయకులు రాజేష్, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు సిరిమల్లి రెడ్డి, పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనసూయ, పిడిఎస్ఒ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.భాస్కర్, పిడిఎస్‌యు నాయకులు కిరణ్, గిరిజన సంఘం నాయకులు వేట్ల సత్యన్నారాయణ తదితర సంఘాల నాయకులు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాల నుండి 200 మంది ప్రజలు పాల్గొన్నారు.

చాపరాయిలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - వై.రామవరం : మండలంలోని బొడ్డగండి పంచాయతి చాపరాయి గ్రామవాసులు పలు సమస్యలతో సతమతమవుతున్నారని మౌలిక వసతులు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, లాక్ కొండ డేవిడ్ రాజ్ ఒక ప్రకటనలో కోరారు. పలు సంక్షేమ పథకాలు అందక ఇబ్బంది పడుతున్నారని, ఇక్కడ నెట్‌వర్క్ సమస్య ఉండడంతో ఏ ప్రభుత్వ పథకానికి సంబంధించి దరఖాస్తు చేసుకోవాలంటే సుమారు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న వై.రామవరం వెళ్లాల్సి వస్తోందన్నారు. అదికూడా రహదారి సరిగా లేక నానా అవస్థలు పడాల్సి వస్తోందని, మారేడుమిల్లి వెళ్లాలన్నా 200 కిలోమీటర్లు వెళ్లాలని, ప్రైవేట్ వాహనాల్లో వెళితే చాలా ఖర్చు అవుతోంది. తీరా అక్కడికి వెళితే అదే సమయానికి కరెంట్ పోవడమో, నెట్ పనిచేయకపోతేనో మళ్లీ తిరిగి ఇంటికి వెళ్లిపోవాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని ఆయన కోరారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - వై.రామవరం : వ్యవసాయాధికారిగా సుజాత సోమవారం బాధ్యతలు స్వీకరించారు, సాదరణ బదిలీలో భాగంగా రామచంద్రపురం నుంచి ఆమె ఇక్కడకు వచ్చారని, ఇంతకు ముందు విధులు నిర్వహిస్తున్నఉషారాణి కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. 10 రైతు కేంద్రాల్లో 640 క్వింటాల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. వీటిని 90 శాతం సబ్సిడీపై రైతులు అందజేస్తామని తెలిపారు.

రంపచోడవరం తహశీల్దార్‌గా బాలాజీ

రంపచోడవరం: మండలంలో పి.రామకష్ణ తహశీల్దార్‌గా విధులు నిర్వహించి రంపచోడవరం మండలం నుండి గోకవరం మండలానికి బదిలీ పై వెళ్లారు. అయన స్థానంలో ప్రస్తుతం మారేడుమిల్లి మండలంలో తహశీల్దార్‌గా పనిచేస్తున్న బాలాజీ సోమవారం అదనపు భాధ్యతలు స్వీకరించారు. బాలాజీకి సిబ్బంది, గ్రామా రెవిన్యూ అధికారులు గ్రామ సర్వేయర్లు శుభాకాంక్షలు తెలిపారు.

ఏజెన్సీలో వర్షం

ప్రజాశక్తి - సీలేరు : జికె వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో ఆదివారం రాత్రి నుంచి వర్షం కురుస్తూనే ఉంది ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పోడు వ్యవసాయానికి అనువుగా ఉంటుందని గిరిజ నులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దారకొండ గుమ్మిరేవులు గాలికొండ ఏ దారకొండ గిరి గ్రామాల్లో రైతులు దుక్కి దున్నుతున్నారు.



సీలేరులో కురుస్తున్న వర్షం

పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులుగా జయరాజ్

ప్రజాశక్తి-పాడేరు:పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులుగా వి.జయరాజ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను టెక్కలి నుంచి పాడేరుకు ప్రభుత్వం బదిలీ చేసింది. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. పాడేరు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులుగా పి.వేణుమాధవ్ బాధ్యతలు స్వీకరించారు. పాడేరులో ఉప సంచాలకులుగా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ నరసింహులు టెక్కలి బదిలీ అయ్యారు. జయరాజుకు పశు సంవర్ధక శాఖ వైద్యాధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసంచాలకులు సిహెచ్ నరసింహులు, సహాయ సంచాలకులు రాజా రవికుమార్, పశు వైద్యాధికారి సృజన, సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో 30 బోన్‌మేరో ట్రాన్స్‌ప్లాంట్లు

ప్రజాశక్తి - ఆరిలోవ : మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లో నెలకొల్పిన అత్యాధునిక బిఎంటి యూనిట్ ప్రారంభమైన ఒక్క సంవత్సరంలో 30 బోన్ మేరో ట్రాన్స్ ప్లాంట్లను విజయవంతంగా నిర్వహించి రోగుల ప్రాణాలు కాపాడి రికార్డు సాధించినట్లు మెడికల్ ఆంకాలజీ చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ రావత్ దేవ్ తెలిపారు. ఈ విజయాన్ని పురస్కరించుకొని సోమవారం ఆరిలోవ మెడికవర్ కేన్సర్ అస్పత్రిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు ఇలాంటి ట్రాన్స్‌ప్లాంట్లు కోసం రోగులు వెల్లూరు లేదా ఎఐఐఎమ్ఎస్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని తెలిపారు. ఇటువంటి కేసులకు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ పరిసర రాష్ట్రాల నుండి వచ్చే రోగులకు ఈ ఆస్పత్రి నూతన ఆశగా నిలుస్తోందన్నారు. లింఫోమా, మల్టిపుల్ మైలోమా వంటి కేన్సర్లకు, ల్యూకేమియా, బోన్ మారో ఫెయిల్యూర్స్‌కు, హై-రెస్క్ హాఫ్లో ఐడెంటికల్ ట్రాన్స్ ప్లాంట్లు, అనీమియా వంటి అరుదైన వ్యాధులకు మెడికవర్ చికిత్స అందిస్తుందని తెలిపారు. పేదలకు ప్రభుత్వ పథకాలు, ఎన్జీవోల సాయంతో ట్రాన్స్ ప్లాంట్లు అందిస్తున్నట్లు వివరించారు. ధనలేమి కారణంగా జీవనావకాశాన్ని కోల్పోవద్దనే సంకల్పంతో పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సహిత్య, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ ఆచార్య పాల్గొన్నారు.

సచివాలయ ఎఎన్‌ఎమ్‌లకు ప్రమోషన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంలకు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని సచివాలయ ఎఎన్ఎంల రాష్ట్ర జనరల్ సెక్రెటరీ దేవకి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఎన్ఎంలు ప్రమోషన్లు రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోని జరిగాయని, ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రమోషన్ జరక్కుండా అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 300 మంది ఎఎన్ఎంలకు ప్రమోషన్ ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్టిఫికెట్లు సరిగ్గా లేవని, ఆర్‌టిఐ వేరే సంఘాలు పెట్టారని, కులగణన జరగాలని, యోగాంధ్ర జనరల్ ప్రమోషన్స్ ఉన్నాయని షాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఆరు నెలలుగా డిఎంహెచ్ఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ప్రమోషన్ ఆర్డర్లు ఇవ్వటం లేదన్నారు. ఇప్పటికైనా తమ ఆవేదన విని ప్రమోషన్ ఆర్డర్లు ఇవ్వాలని, లేకుంటే ధర్నా కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఈ ధర్నాలో అధిక సంఖ్యలో ఎఎన్ఎంలు, సిఐటియు నాయకులు కె.మణి, మన్యం జిల్లా నాయకులు వి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మత్తు వద్దు... బంగారు భవిష్యత్తే ముద్దు...

ప్రజాశక్తి-సీతమ్మధార : 'అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం' సందర్భాన్ని పురస్కరించుకొని 'మత్తు వద్దు.. బంగారు భవిష్యత్తే ముద్దు..' అన్న నినాదంతో బాలవికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన పోస్టర్‌ను అక్కయ్యపాలెంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్) డైరెక్టర్ ఈదర రవికిరణ్ తన ఛాంబర్లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతరం మత్తుకు బానిస కావొద్దంటూ బాలవికాస్ ఫౌండేషన్ సంస్థ విస్తృత ప్రచారం చేయడం ఆనందకరమని చెప్పారు. పిల్లల ప్రవర్తన గురించి తల్లిదండ్రులు నిత్యం గమనించాలని, వారికి అభిరుచి ఉన్న రంగంలో నైపుణ్యాలను వృద్ధి చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. బాలవికాస్ వ్యవస్థాపక గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, ఈ నెల 26వ తేదీన కళాశాలల్లో మాదకద్రవ్యాలపై యువతరానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.

పిఎం జన్‌మన్ గృహాల బిల్లులు చెల్లించాలి



అరకులోయ మండలం సుంకరమెట్టలో నినాదాలు చేస్తున్న సర్పంచ్, లబ్ధిదారులు

ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి అరకులోయ రూరల్:పీఎం జన్ మన్ ఇల్లుల బకాయి చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు, సుంకర మెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు డిమాండ్ చేశారు. అరకులోయ మండలం సుంకరమెట్ట పంచాయతీ పరిధి గ్రామాలైన పెదగంగగుడి, దాబుగుడ, సంఘంవలస పిరిబంద గ్రామాల్లో సోమవారం పర్యటించి పీఎం జన్ మన్ లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లబ్ధిదారులతో గ్రామ సచివాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు, సుంకర మెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు మాట్లాడుతూ, పీఎం జన్ మన్ హౌసింగ్ బకాయి బిల్లులు విడుదల డిమాండ్ చేస్తూ పాడేరు ఐటీడీఏ కార్యాలయం వద్ద ఈ నెల 27న జరిగే ధర్నాను పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పీఎం జన్ మన్ హౌసింగ్ పథకం కింద నిర్మించిన ఇళ్లలకు లింటల్, స్లాబ్ లెవెల్ బిల్లులు బకాయి ఉన్నాయని, సుంకర మెట్ట పంచాయతీ లో మొదటి విడత బిల్లు విడుదల కాని లబ్ధిదారులు 60 మంది లబ్ధిదారులు, లింటల్ లెవెల్ బిల్లులు పడని లబ్ధిదారులు 150 కి పై బడి ఉన్నారని తెలిపారు. తక్షణమే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బిల్లులు మంజూరు కావాలంటే హౌసింగ్ అధికారులకు ముడుపులు చెల్లిస్తే తప్ప చేయమని చెపుతున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారన్నారు. ఉన్నత స్థాయి అధికారులు సక్రమంగా పర్యవేక్షణ చేయాలని, అవినీతి ఆరోపణలు రుజువైతే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్కొక్క ఇల్లు నిర్మాణానికి 10 లక్షలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు సిహెచ్ గురుమూర్తి, పి నానిబాబు, పీఎం జన్ మాన్ లబ్ధిదారులు బి.నితీష్ కుమార్, కె రాజశేఖర్, పిరిబంద పేసా కార్యదర్శి కె.సాయి కుమార్, వి భాస్కరరావు, సత్తిబాబు, సిమన్ పాల్గొన్నారు.

27న ధర్నాను జయప్రదం చేయాలి

హుకుంపేట:పీఎం జన్ మన్ హౌసింగ్ పథకం కింద ఇప్పటికీ బిల్లులు చెల్లించకపోవడంపై ఆదివాసీ గిరిజన సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హుకుంపేట మండల పరిషత్ వైస్ ఎంపీపీ, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు సూడిపల్లి కొండలరావు ఆధ్వర్యంలో జర్రాకొండ పంచాయితీ పరిధిలోని సీసాయి పనుకు, బురదగుమ్మి గ్రామాల ప్రజలతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పీఎం జన్ మన్ హౌసింగ్ పథకంలో నిర్మించిన బేస్‌మెంట్, లింటల్, స్లాబ్ స్థాయిల నిర్మాణాలకు సంబంధించి పాడేరు ఏజెన్సీ 11 మండలాల్లో సుమారు రూ. 21 కోట్లు బిల్లులు బకాయి ఉన్నాయని తెలిపారు.ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న "చలో ఐటీడీఏ పాడేరు" ధర్నాకు పెద్దఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బురద గుమ్మి వార్డు మెంబర్ మర్రి శైలజ, గవ్వల మామిడి పీసా కమిటీ ఉపాధ్యక్షుడు జంగిడి గణేష్, గిరిజన సంఘం నాయకులు మర్రి కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

పౌష్టికాహారం అందించకుంటే చర్యలు

ప్రజాశక్తి- అనంతగిరి:మాతా శిశు మరణాలు అరికట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేస్తున్న పౌష్టకాహారం లబ్ధిదారులకు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఐసిడిఎస్ అల్లూరి సీతారామరాజు జిల్లా పీడి ఝాన్సీ లక్ష్మీబాయి హెచ్చరించారు. మండలంలోని అనంతగిరి పంచాయతీ, ఎగువ శోభ పంచాయతీ పరిధి మర్దగూడ అంగన్వాడి కేంద్రాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. అంగన్వాడి కేంద్రాలు పనితీరు, లబ్ధిదారులకు పౌష్టికాహారం. మిల్క్ పౌడర్ అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆహార పదార్థాలను సకాలంలో లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. పంపిణీలో పక్కదారి పట్టినట్లు తమ దృష్టికి వచ్చినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గర్భిణీ, బాలింత, చిన్నారుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు పాల్గొన్నారు



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీడీ

నేరాలు ఘోరాలు

చోరీ నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-జికె.వీధి:మండలంలోని ఆర్.వి నగర్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్‌కు చెందిన 25 బస్తాల మిరియాలను ఈనెల 5వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ చోరీ సంఘటనపై సంబంధిత ఫారెస్ట్ అధికారులు జీ.కే వీధి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సీఐ వరప్రసాద్, ఎస్ఐ అప్పలసూరి కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా వాహనాల తనిఖీ చేస్తుండగా బైక్ పై వస్తున్న ముగ్గురు వ్యక్తులను విచారించి ముగ్గురు నిందితులను అదుపులోనికి తీసుకొని వారి దగ్గర నుండి 5 బస్తాల మిరియాలు, ఒక పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ తరలించామని సీఐ వరప్రసాద్, ఎస్ఐ అప్పలసూరి తెలిపారు.

పాముకాటుతో ఉక్కు ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు టౌన్ షిప్ సెక్టార్-4లో ఇంట్లో నిద్రిస్తున్న ఉద్యోగి తాగరంపూడి శ్రీనివాస్ (58) పాము కాటుతో మృతిచెందారు. ఇంట్లో నిద్రిస్తున్న శ్రీనివాస్‌ను తెల్లవారి 4.15 గంటలకు పాము కుట్టింది. ఆయన వెంటనే ఉక్కు జనరల్ ఆసుపత్రికి వెళ్లారు. డ్యూటీలో ఉన్న డాక్టర్‌తో మాట్లాడుతుండగానే శ్రీనివాస్ కుప్పకూలి పోయాడు. వెంటనే కిమ్స్ ఆసుపత్రికి తరలిస్తుండగా దారిలోనే చనిపోయినట్టు నిర్ధారించారు. పాము కాటుకు గురైన శ్రీనివాస్ ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నారు. శ్రీనివాస్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తాళాలు వేసిన ఇంట్లో చోరీ

- ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరణ

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ పోలీస్ స్టేషన్ పరిధి లంకెలపాలెంలో తాళాలు వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. దుండగలు బీరువాలోని ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని గ్రేటర్ విశాఖ 79వ వార్డు పరిధి లంకెలపాలెం రామాలయం వీధిలో నివాసముంటున్న సూరిశెట్టి వెంకటలక్ష్మి తన పెద్ద కుమార్తెతో కలిసి పెందుర్తి మండలంలోని బంధువుల ఇంటికి శనివారం వెళ్లారు. ఆదివారం ఉదయం ఆమె బంధువు సూరిశెట్టి అప్పలరాజు ఇంటి మెయిన్ డోర్, బెడ్‌రూమ్ డోర్ తాళాలు తీసి ఉన్నట్లు గమనించి వెంకటలక్ష్మికి సమాచారం అందించారు. వెంటనే తన ఇంటికి వచ్చి పరిశీలించగా, బెడ్‌రూంలో దాచిన తాళాలను తీసుకుని వాటితో బీరువా ఓపెన్ చేసి, లోపలి లాకర్‌లో ఉన్న సుమారు ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు గుర్తించారు. దీనిపై ఆదివారం పరవాడ పోలీసులకు బాధితరాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు క్లూస్ టీం సంఘటనా స్థలానికి వచ్చి ఫింగర్ ప్రింట్లు సేకరించింది. తలుపులు, తాళాలపై బలవంతపు ప్రవేశం జరిగినట్లు ఎలాంటి ఆనవాళ్లు లేవని, ఈ ఘటన అనుమానాస్పదంగా ఉన్నందున అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని సిఐ మల్లికార్జునరావు తెలిపారు.

డేటా సైన్స్‌లో కృత్రిమ మేధపై ఎఫ్‌డిపి

ప్రజాశక్తి-మధురవాడ : డేటా సైన్స్, కంప్యూటర్ విజన్‌లలో కృత్రిమ మేధ ఆవిష్కరణలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, ఎన్ఐటి వరంగల్, కేంద్రప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం సంయుక్తంగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డిపి)ను సోమవారం నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా ఎన్ఐటి వరంగల్ మిషన్ లెర్నింగ్ ఆల్గరిథమ్స్ నిపుణుడు ప్రొఫెసర్ జె.రవికుమార్ హాజరై మాట్లాడుతూ, డేటా ఆధారిత సాంకేతిక విప్లవంలో నిపుణులైన మానవ వనరులను తయారుచేయడానికి ఎఐఎమ్ఎల్ వంటి అంశాలను సిలబస్‌లో చేర్చాలని సూచించారు. కృత్రిమ మేధ ఆధారంగా భవిష్యత్తులో సాంకేతిక ప్రగతి సాధించవచ్చని పేర్కొన్నారు. వివిధ ఇంజినీరింగ్ విభాగాల మధ్య సమన్వయంతో కృత్రిమ మేధపై సంయుక్త అధ్యయనాలు చేపట్టాలని అధ్యాపకులకు సూచించారు. విద్యార్థులను భవిష్యత్ అవసరాలకు తగిన విధంగా సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఎఫ్‌డిపి కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, సిఎస్ఇ కోర్సుల డీన్ ప్రొఫెసర్ ఎస్.అరుణ్‌కుమార్, సిఎస్ఇ విభాగం అధిపతి డాక్టర్ జి.లక్ష్మీశ్వరి, కృత్రిమ మేధ, డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కె.నవీన్ కుమార్, కార్యక్రమ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజమణి ప్రసంగించారు. ఆరు రోజుల పాటు జరిగే ఈ ఎఫ్‌డిపి కార్యక్రమంలో జనరేటివ్ ఎఐ, కంప్యూటర్ విజన్‌లో కృత్రిమ మేధ ఆవిష్కరణలు, ఎక్స్‌ప్లైనేబుల్ ఎఐ వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ విద్యాసాగర్

ఉపాధి పనుల్లో తప్పు జరిగితే చర్యలు

ప్రజాశక్తి - గంగవరం :ఉపాధి పనుల్లో అవినీతి జరిగితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పిడి విద్యాసాగర్ హెచ్చరించారు. సోమవారం ఉపాధి హామీ పథకం 2024బి25 లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ మండలంలో 17 పంచాయతీల్లో రూ.17 కోట్ల వ్యయంతో ఉపాధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించామన్నారు. పనుల్లో నాణ్యతలోపం అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపిపి పల్లాల కృష్ణారెడ్డి, .జెడ్‌పిటిసి బేబీరత్నం , వైస్ ఎంపిపి గంగాదేవి, ఎపిడి రాంబాబు, ఎంపిడిఒ లక్ష్మణరావు, సోషల్ ఆడిట్ ఎస్‌సిఆర్‌సి పున్నపు నాయుడు, విజిలెన్స్ అధికారి సురేష్‌కుమార్ , ఉపాధి ఎపిఒ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎఒ భానుప్రియ

వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - కొయ్యూరు: మండలంలోని చీడిపాలెం రైతుసేవా కేంద్రంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 90శాతం సబ్సిడీపై వరి విత్తనాలు మండల వ్యవసాయ అధికారి భానుప్రియ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. చీడిపాలెం సర్పంచ్, ఎంపిపి మాజీ జిసిసి ఛైర్మన్ ప్రసాద్ , మండల టిడిపి అధ్యక్షుడు పాల్గొన్నారు.



ఎఒ ఉమాదేవిని సన్మానిస్తున్న జిసిసి ఛైర్మన్ తదితరులు

ఎఒ ఉమాదేవికి ఘన సన్మానం

ప్రజాశక్తి - కొయ్యూరు: కొయ్యూరు మండల వ్యవసాయ శాఖాధికారి ఉమాదేవి ఇటీవల సాధారణ బదిలీలో భాగంగా విశాఖకు బదిలీపై వెళ్లారు. ఈ మేరకు జిసిసి మాజీ ఛైర్మన్ యం.వి.వి ప్రసాద్ , ఎంపిపి రమేష్ స్థానిక సర్పంచ్ లు సింహాచలం, సోమన్నదొర, బిజెపి నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.ఉమాదేవి సేవలను కొనియాడారు.

బర్దన్‌నగర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

మేయర్‌కు సిపిఐ విజ్ఞప్తి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పెందుర్తి మండలం చినముషిడివాడ జివిఎంసి 97వ వార్డ్ బర్దన్‌నగర్ కాలనీలో విద్యుత్తు సదుపాయంతో పాటు, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సోమవారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నాయకులు జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.రెహమాన్ మాట్లాడుతూ బర్దన్‌నగర్ కాలనీలో 2014 నుంచి 100 కుటుంబాలు నివాసం ఏర్పాటు చేసుకున్నాయని వీరంతా భవన నిర్మాణ కార్మికులు చేతి పూర్తి పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారే అన్నారు. వీరి ఇళ్లను తొలగించడానికి ప్రయత్నించగా 2017లో హైకోర్టు వారిని తొలగించవద్దని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కాలనీలో మూడు చేతి పంపులనున జివిఎంసి నిధులతో ఏర్పాటు చేశారన్నారు. కొంతమంది రేకులషెడ్లు వేసుకుని జీవిస్తున్నారని వీరు ఇంటి పన్నులు కూడా చెల్లిస్తున్నారన్నారు. అయితే విద్యుత్ సదుపాయం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పి.చంద్రశేఖర్,కె.సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు సి.ఎన్ క్షేత్రపాల్, ఆర్.శ్రీనివాసరావు, వనజాక్షి, వై.త్రినాథ్ పాల్గొన్నారు.



మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతి పత్రం ఇస్తున్న సిపిఐ నాయకులు

అందరికీ కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

- ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరికి కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని, తద్వారా ఉన్నత విద్యలో నైపుణ్యాన్ని సంపాదించడానికి అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. 41వ వార్డు జ్ఞానాపురంలో సేక్రెడ్‌హార్ట్స్, జూబ్లీమిషన్ స్కూళ్లలో సోమవారం కంప్యూటర్ ల్యాబ్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదంత కంపెనీ దక్షిణ నియోజవర్గానికి అనేక విధాలుగా తమ సహకారం అందిస్తున్నారని వారి సేవలను కొనియాడారు. దేశవ్యాప్తంగా వేదంత కంపెనీ ద్వారా పలువురు సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా, అనేక సదుపాయాలు కల్పించడం గర్వకారణంగా భావిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రూ.10 లక్షల విలువైన లాప్‌టాప్‌లతో పాటు, రూ.5 లక్షలతో నైపుణ్యం గల ఉపాధ్యాయులను అందజేసిన వేదంత కంపెనీకి, ఈ సందర్భంగా స్థానిక యాజమాన్యంతో పాటు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్‌తో పాటు స్థానిక టిడిపి, జనసేన నాయకులు ఆంథోనీ శేఖర్, మధుబాబు, సంజీవరావు, వేదాంత సిఇఒ సతీష్, సిఎస్ఆర్ విజి సిబి లక్ష్మి పాల్గొన్నారు.




కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకే జగన్ పర్యటనపై దుష్ప్రచారం

ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనలో పోలీసుల వైఫల్యం కనిపించడమే కాకుండా తర్వాత పరిణామాలు చూస్తుంటే రాజకీయాలు ఎలా దిగజారిపోయాయో అర్థమవుతోందని వైసిపి ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. బీచ్‌రోడ్డులోని బొత్స క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగమయ్య అనే వైసిపి కార్యకర్త జగన్ వాహనం కింద పడలేదని, వేరే వాహనం వల్ల ప్రమాదం జరిగిందని ఎస్పీనే తెలిపారని, ప్రమాదానికి కారణమైన వాహనదారులను పిలిచి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించిన అధికారులు మళ్లీ ఎందుకు మాట మార్చారని బొత్స నిలదీశారు.

వైసీపీ అధికారంలో వున్నప్పుడు మూడేళ్ల వరకు టీడీపీ రోడ్డు ఎక్కలేకపోయిందని, మరి ఇప్పుడు ఎందుకు ఇంత వ్యతిరేకత వచ్చిందని ప్రశ్నించారు.కాన్వాయ్, ఎస్కార్ట్ పర్మిషన్ ఇచ్చినప్పుడు రోప్ పార్టీ ఏమైపోయిందని, ఎక్కడ ఉంది మీ పోలీస్ వ్యవస్థ అని నిలదీశారు. పీ4 పబ్లిసిటీ మాత్రమే అని, యోగా దినోత్సవం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టడం కరెక్టేనా అని బొత్స మండిపడ్డారు. గాయపడిన వ్యక్తిని ప్రైవేట్ వాహనంలో ఆసుపత్రికి తీసుకుని వెళ్లకుండా ఎస్సై రాజశేఖర్ అడ్డుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. యోగాంధ్ర గిన్నీస్ వరల్డ్ రికార్డ్ బోగస్ అని, 2 లక్షల 40 వేల మంది హాజరయ్యారని అధికారులు చెబితే, మూడు లక్షలు దాటిందని గిన్నీస్‌బుక్ వాళ్ళు చెప్పారని, దీంట్లో ఏది నిజం అని బొత్స ప్రశ్నించారు. సమావేశంలో మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్, కేకే రాజు, తైనాలవిజయ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కెవిపిఎస్, సిఐటియు నాయకులు, బాధితులు

కులం పేరుతో తిట్టినవారిని అరెస్ట్ చేయాలి

- కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దొండపర్తి జంక్షన్ సమీపంలో మిరాజ్ సినిమాస్‌లో పనిచేస్తున్న గిరిజన మహిళలను కులం పేరుతో దూషించి, అవమానించి, వారిని ఉద్యోగం నుంచి తొలగించిన డ్యూటీ మేనేజర్లు జ్యోతి, వెంకటేష్‌లపై ఎస్సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు డిమాండ్ చేశారు. సోమవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలగించిన కార్మికులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే మిరాజ్ సినిమాస్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు ఎం. సుబ్బారావు, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో డిఆర్‌ఒకు వినతిపత్రం అందించారు.

జగన్నాథస్వామి రథయాత్రకు మేయర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: జగన్నాథ స్వామి వారి కళ్యాణం, రథయాత్రకు నగర మేయర్ పీలా శ్రీనివాసరావుకు శ్రీ జగన్నాథ స్వామి దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి టి.రాజగోపాల్‌రెడ్డి ఆహ్వాన పత్రికను జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్లో సోమవారం అందించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విశాఖపట్నంలో జూన్ 27న నిర్వహించే జగన్నాథ స్వామి రథయాత్రలో పాల్గొనేందుకు ఆహ్వానం అందిందని జూన్ 27 నుండి జూలై 7 వరకు రథయాత్ర జరుగుతుందని కార్యక్రమానికి వేలాదిగా భక్తులు వస్తారని ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారికి మేయర్ సూచించారు.

రామకృష్ణ థియేటర్‌ను కూల్చి వేయాలి

- తెలుగుశక్తి అధ్యక్షుడు బివి.రామ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బౌరాడారోడ్‌లోని రామకృష్ణ పిక్చర్ ప్యాలెస్‌పై హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయడంలో జివిఎంసి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి రామ్ ఆరోపించారు. సోమవారం జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రామ్ మీడియాతో మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న రామకృష్ణ థియేటర్‌ను కూల్చివేసి, న్యాయంగా వేగి రాధాకృష్ణకి రావాల్సిన ప్రాపర్టీని అప్పచెప్పాలని అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని హైకోర్టు తీర్పు చెప్పిందన్నారు. ప్రస్తుతం అది ఆక్రమణలో ఉందన్నారు. వేగి రాధాకృష్ణ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ ఎసిపి దేవకుమార్, బిల్డింగ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ లంచాలు తీసుకుని, హైకోర్టు తీర్పును అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి కూడా నోటీసులు పంపించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పి.గణపతి తదితరులు పాల్గొన్నారు.

సమాచార శాఖ డిడిగా సదారావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమాచార పౌర సంబంధాల శాఖ, విశాఖపట్టణం రెగ్యులర్ డిడిగా కె.సదారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు నెల్లూరు డిడిగా సేవలందించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖపట్టణం ఉపసంచాలకులుగా నియమితులయ్యారు. ఈ మేరకు ఇప్పటివరకూ ఇన్‌చార్జి డిడిగా వ్యవహరించిన డి.రమేశ్ నుంచి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. సంబంధిత పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సమాచారపౌర సంబంధాల శాఖ, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్‌ను మురళీనగర్‌లోని తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు.